

వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ ఇళ్ల పైపుల దుస్థితి



వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

'కల'గానే సొంతిళ్లు!

పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఆశలు గల్లంతయ్యాయి. కూడు లేకున్నా.. గూడు ఉంటే చాలని ఆశపడిన నిరుపేదలకు నిరాశే మిగులుతోంది. నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా అయినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి నోచుకోవటం లేదు. దీంతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరీక్షణ తప్పటం లేదు. డబుల్ ఇళ్లు ఇస్తామని మధ్య దళారులు పేదల నుంచి అందినంతా దండుకున్నారు. అయినా ఇళ్లు రాక.. ఇంటి కోసం ఇచ్చిన డబ్బులు తిరిగి రాక.. పేదల అరిగోస పడుతున్నారు. తమకు డబుల్ ఇళ్లు కేటాయించాలని ఆందోళనకు దిగుతున్నారు.

సొంతింటి కల

పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు 25,994 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో కేవలం 11,049 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేశారు. సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు పునాదులు, పిల్లర్లు, రూఫ్ లెవల్ స్థాయిలోనే నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే గృహ నిర్మాణ పనులను నిలిపివేశారు.

దళారుల వసూళ్లు

డబుల్ ఇళ్ల పేరుతో కొన్నిచోట్ల మధ్య దళారులు భారీగా వసూళ్లు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి కొందరు గులాబీ నేతలు, దళారులు పేదల నుంచి ఇంటికి రూ.50వేల నుంచి రూ.5లక్ష వరకు వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు భారీగా డిమాండ్ ఉంది. నగరం నడిబొడ్డున ఈ ఇళ్లు ఉండటంతో చాలామంది దళారుల వీటిపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇళ్లు ఇప్పిస్తామని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అనర్హుల నుంచి వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. జనగామ, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలోనూ ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి.

శిథిలావస్థలో..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవటంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వరంగల్ జిల్లా దేశాయిపేటలో నిర్మించిన వాటిలో చాలావరకు ఇంటి తలుపులు, కిటికీలు పగిలిపోయాయి. స్లాబ్‌పై నుంచి సిమెంట్ బిచ్చలు రాలుతున్నాయి. హనుమకొండలోని బాలసముద్రంలోని డబుల్ ఇళ్ల పరిస్థితి కూడా శిథిలమై పనికి రాకుండా తయారవుతున్నాయి. ప్రస్తుతం వాటిని మరమ్మతులు చేయాలంటే ప్రతీ ఇంటికి తక్కువలో తక్కువగా రూ.50వేలకు పైగా ఖర్చు వస్తోందని అంచనా. ఖాళీగా ఉండటంవల్ల మరింత శిథిలావస్థకు చేరుకుంటాయని లబ్ధిదారులు అంటున్నారు.

ఆ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వినియోగంలో

» మిగతా 6వ పేజీలో..

- » ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- » ఉమ్మడి జిల్లాకు 25,994 ఇళ్లు మంజూరు
- » నిర్మాణం పూర్తైనవి 11,049 మాత్రమే
- » 5,728 ఇళ్లను పంపిణీ చేయకుండా తాత్సారం
- » శిథిలమవుతున్న గోడలు, తలుపులు, కిటికీలు
- » అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా గృహాలు
- » వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారుల ఆందోళనలు

ఉమ్మడి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్‌ల పరిస్థితి ఇలా..

జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తైన ఇళ్లు	పంపిణీ చేసినవి	పంపిణీ చేయనివి
వరంగల్	6,333	2,300	597	1,703
హనుమంకొండ	4,219	2,158	433	1,725
జనగామ	4,393	1,454	670	784
మహ-బాద్	5,567	2,503	1,403	1,100
భూపాలపల్లి	3,882	1,418	1,003	416
ములుగు	1,600	1,215	1,215	00
మొత్తం	25,994	11,049	5,321	5,728



మొక్కలతో నిండిపోయిన అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన ఇళ్లు



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ సత్య శారద

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 22: వరద ఉధృతి తగ్గినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. సోమవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి,రెవెన్యూ, మునిసిపల్ అధికారులతో కలిసి వరంగల్‌లోని బొందివాగు, కొలంబో ఆస్పత్రి ప్రాంతం, చిన్న వడ్డెపల్లి చెరువు ప్రాంతా ల్లోని వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశా రు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షపు నీటి ప్రవాహం తగ్గినప్పటికీ ప్రజలు, అధికా రులు వచ్చే రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ముట్టుకోరాదని సూచించారు. చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్న పిల్లలు, వృద్ధుల తగిన జాగ్రత్తగా పాటించాలని, ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణ సమయంలో రోడ్లు, వంతెనలు తెగిపోయి రాకపోకలకు ఆటంకాలు ఎదురైతే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నెంబర్ 18004253434, 18094251980లలో సంప్రదించాలని కలెక్టర్ వెల్లడించారు.



బొందివాగు నాలాను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

లోతట్టు ప్రాంతాల పరిశీలన

నగర కమిషనర్‌తో మేయర్ సుధారాణి సందర్శన

వరంగల్ కార్పొరేషన్, జూలై 22: భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను సూచించారు. సోమవారం వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. 12మోరీలు, పోతన నగర్, విద్యుత్ సబ్‌స్టేషన్, భద్రకాళి గుడికి వెళ్లే మార్గంలో నాలా, పెద్దమ్మగడ్డ నాలా, చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఎస్ఎస్‌నగర్, భట్టుపల్లి ప్రాంతాల నుంచి వచ్చే నీరు బొందివాగు మీదుగా భద్రకాళి సమీపంలోని నాలాలో కలుస్తోందని, ఆ ప్రాంతంలో నాలా విస్తీర్ణం చిన్నదిగా ఉండడంవల్ల సంతోషిమాతా కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, సాయిగణేశ్, బృందావన్‌కాలనీలలో ఉన్న ఇళ్లలోకి నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పోతననగర్ చెరువు కట్టకు ఏదైనా దెబ్బ తిన్నట్టు అధికారులు గుర్తిస్తే దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు. మేయర్‌తో పాటు ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్ డీఈలు, ఏఈలు ఉన్నారు.

విధుల్లో చేరిన ఆర్ఎంవో



యాకుబ్ పాషా

గిర్మాజిపేట, జూలై22 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నూతన ఆర్ఎంవోగా డాక్టర్ యాకుబ్ పాషా సోమవారం విధుల్లో చేరారు. గురువా రం జరిగిన వైద్య ఆరోగ్యశాఖ సాధారణ బదిలీల్లో ఆర్ఎంవో డాక్టర్ శ్యామ్ కుమార్ జనగామ డీఎంహెచ్ కార్యాలయానికి, హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకుబ్‌పాషా ఇక్కడికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు యాకుబ్‌పాషా ఆదివారం రిపోర్ట్ చేసి సోమవారం విధుల్లో చేరారు. ఆస్పత్రి ఇన్‌పేషంట్ వార్డులు, అవుట్ పేషంట్ విభాగాలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, అలసత్వానికి తావివ్వొద్దని సూచించారు. సకాలంలో విధులకు రాకుంటే తగిన ర్యలు తీసుకుంటామని సిబ్బందికి హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి కర్ణన్ నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో సూపరింటిడెంట్ డాక్టర్ నిర్మలాకుమారితో కలిసి యాకుబ్‌పాషా పాల్గొన్నారు. నర్సింగ్ సిబ్బంది సీనియారిటీ జాబితాలను ఎలాంటి తప్పులు లేకుండా పంపించాలని కర్ణన్ ఆదేశించారు. ఆర్ఎంవోకు నిర్మలాకుమారి, ఏవో సాజిద్ అలీ, సీనియర్ అసిస్టెంట్‌లు సాంబరాజు రాజు, మోహన్ అభినందనలు తెలిపారు.



గంజాయిని అరికట్టాలి : సీపీ

వరంగల్ క్రైం, జూలై 22: వరంగల్ కమిషనరేట్ పరిధిలో గంజాయి విక్రయాలు, సేవించడం ఉక్కుపాదంతో అణచివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని కమిషనరేట్‌లో ఆరుమాసాల నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ప్రధాన కేసుల దర్యాప్తు వాటి పురోగతి, నిందితుల అరెస్టు కారణాలను సమీక్షించారు. సీపీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో టెక్నాలజీతోపాటు శాస్త్రీయ పద్ధతిని అనుసరించాలన్నారు. కేసు నమోదైన వారంరోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. రౌడీషీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. బాలికలు, మహిళల మిస్సింగ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. నిరంతర కార్డన్‌సెర్చ్‌లు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టాలని సీపీ ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రెండో రోజూ శాకంబరీ దర్శనం

వరంగల్ కల్చరల్, జూలై 22: ఆషాఢ శుద్ధ పౌర్ణమి ఆదివారం రోజున భద్రకాళి అమ్మవారికి నిర్వహించిన శాకంబరీ అలంకరణను సోమవారం కూడా భక్తుల దర్శనార్థం అలంకరణను ఉంచారు. వర్ష ప్రభావంతో అమ్మవారి దర్శనార్థం రాని భక్తుల దర్శనం కోసం శాకంబరీ అలంకరణను అమ్మవారి ఆలయంలో తొలగించలేదు. సోమవారం సాయంత్రం శాకంబరీ అలంకరణను తొలగించి భక్తులందరికి ప్రసాద వితరణ చేశారు. ఉత్సవాలు 16 రోజులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించడంలో ప్రజలకు, భక్తులకు సమాచారం తెలియజేసిన మీడియా వారికి ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ధన్యవాదాలు తెలిపారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై దృష్టి పెట్టండి

● అధికారులకు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశం ● 91 ఫిర్యాదులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 22: గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులకు తక్షణమే స్పందించి ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్‌సెల్) కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను పిలిచి మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం జరిగిన గ్రీవెన్స్‌లో 91 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్ పలాస, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నుంచి కాలుష్యం

కాశీబుగ్గ చౌరస్తా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నుంచి ఆహారపదార్థాలు తయారు చేస్తున్న సమయంలో కాలుష్యంతో కూడిన పొగ రావడంవల్ల ఆ ప్రాంతంలో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. సాయంత్రం సమయంలో పెద్దఎత్తున పొగ రావడంవల్ల కళ్లు మంటలు మండుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి

ముంపునకు గురికాకుండా చూడాలి

వరంగల్ బొందివాగు నాలా స్మార్ట్ డ్రైన్ నుంచి 12 మోరీల వరకు కచ్చా కాలువ తీయాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. చాలాకాలంగా బొందివాగు ప్రాంతంలో తాత్కాలిక పనులు నిర్వహిస్తున్నారని, కాలువలో ఉన్న చెత్త, మట్టిని తరుచుగా తీయడం వల్ల వర్షాకాలంలో ప్రమాదాలు తగ్గుతాయని వెల్లడించారు.

ఆ కోళ్ల ఫారాలు తొలగించాలి

హనుమకొండ గోపాల్‌పూర్ సమీపంలోని వినాయకకాలనీలో కొంత కాలంగా రమేష్ అనే వ్యక్తి ఇండ్ల మధ్యలో కోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, వెంటనే కోళ్ల ఫారాలను తొలగించాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని రమేష్‌ను కోళ్ల ఫారాలు తీసువేయాలని చెప్పడానికి వెళితే భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు.

ఫిర్యాదులు

- ఇంజనీరింగ్ - 22
- హెల్త్ అండ్ శానిటేషన్ - 7
- ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ -7
- టౌన్‌ప్లానింగ్ - 55
- మొత్తం -91



కమిషనర్‌కు వినతి పత్రాలు అందిస్తున్న నగర ప్రజలు

రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలి

భద్రకాళి బండ్ చుట్టుపక్కల ప్రాంతాలను గుర్తించి ఎఫ్‌టీఎల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని బండ్ చుట్టుపక్కల ప్రాంతాల వారు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. భద్రకాళి ట్యాంక్ ఫోర్‌షెడ్ బండ్ ప్రాంతంలో బలహీనవర్గాల కుటుంబాలకు 26 ప్లాట్లు కేటాయించారని, 24 యేళ్లుగా ఇదే ప్రాంతంలో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నామన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

3వ డివిజన్ ఆరెపల్లి గ్రామంలో పట్టా భూమి ఆక్రమిస్తున్న వ్యక్తికి కాశిబుగ్గ సర్కిల్ మునిపల్ అధికారులు వత్తాసు పలుకుతూ తనకు అన్యాయం చేస్తున్నారని ఆరెపల్లికి చెందిన బుద్దె తిరుమలేశ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. తన భూమిని సర్వే చేసి తనకే చెందే విధంగా కమిషనర్ చొరవ చూపించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

తగ్గుముఖం పట్టిన వాన

వరంగల్ వ్యవసాయం, జూలై 22: జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా నాలుగు రోజులుగా కురిసిన వర్షం సోమవారం మాత్రం సెలవిచ్చింది. దీంతో ప్రజలు తేరుకుని ఎవరి పనులకు వారు వెళ్లారు. రైతులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. నాలుగు రోజులుగా ఇళ్లకే పరిమితమైన ప్రజలకు సోమవారం వర్షం తగ్గుపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమ వారం ఉదయం వరకు జిల్లాలో 35మి.మీ సాధారణ వర్షపాతం నమోదైంది. వరంగల్ మండలంలో 45.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఖిలావరంగల్ మండలంలో 39.0 మి.మీ, ఖానాపు రంలో 35.8 మి.మీ, దుగ్గొండిలో 35.2 మి.మీ, నర్సం పేటలో 31.4 మి.మీ, నెక్కొండలో31.2 మి.మీ నమోదైంది. అలాగే వర్ధన్నపేటలో 33.8మి.మీ, పర్వతగిరిలో 16.2 మి.మీ, సంగెంలో 32.6 మి.మీ, గీసుగొండలో 38.6 మి.మీ, నల్లబెల్లిలో 52.6 మి.మీ, రాయపర్తిలో 24.8 మి.మీ, చెన్నారావుపేటలో 38.6మి.మీ నమోదైంది.



పాకాల కళకళ

ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ శివారులోని పాకాల సరస్సు నీటి మట్టం సోమవారం 23 అడుగులకు చేరుకుంది. 30అడుగుల పూర్తి సామర్థ్యం గల పాకాల సరస్సులోకి వానకాలం సాగుకు సరిపడే నీరు రావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. దీంతో పాకాల ఆయకట్టులో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

-ఖానాపురం

ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలి

అధికారులు మీసేవా కేంద్రాలను పరిశీలించాలి

గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ సత్య శారద ఆదేశం



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 22: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం అలసత్వం వహించరాదన్నారు. వివిధ మండ లాల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని మీసేవా కేంద్రాలను తరచుగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 123 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 74, లీడ్ బ్యాంక్ 6, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 8, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ 3, పౌరసరఫరాల శాఖ, మహానగర పాలక సంస్థ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖలకు కలిపి 24 వినతులు అందినట్లు తెలిపారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు వేదిక కావాలి

నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం కలెక్టరేట్‌ని సమావేశ మందిరంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, కాలేజీ యువత, ఆవిష్కరణ మీద ఆసక్తి ఉన్న వారు తమ ఆవిష్కరణలను మూడు నిమిషాల వీడియో తీసి 9100 678543 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవో కృష్ణవేణి, ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.



‘కల’గానే సొంతిళ్లు!

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీలు, సెటిల్‌మెంట్‌లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనే వాడుతున్నారు. వరంగల్ నగర శివారులోని దూపకుంట ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్‌లాంటి వాటిని తీసుకునేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వినియోగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వ్యభిచారాలకు కూడా వాడుకుంటున్నారనే చర్చ ఉంది. ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రక్షణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా వాటిని వినియోగించుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

లబ్ధిదారుల ఆందోళనలు



హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలు పగులగొట్టిన లబ్ధిదారులు

హనుమకొండలోని బాలసముద్రం ఇళ్లను పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. నిర్మాణం పూర్తైన ఇళ్లలోకి వెళ్లటంతో పోలీసులు జోక్యం చేసుకోవల్సి వచ్చింది. అలాగే భూపాలపల్లి పట్టణంలోని 430 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాలని గత నెలలో నాలుగు రోజులు ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్‌లో నిర్మించిన 712 ఇళ్లు పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కలిసి స్థానికులు విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో 70 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిని పంపిణీ చేయకపోవటంతో 40ఇళ్లలో తలుపులు తీసుకుని స్థానికులు నివాసం ఏర్పాటుకు ప్రయత్నించారు. వారంలో గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చి దాటవేశారు. ఇలా ఉమ్మడి వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఖాళీగా ఉండటంతో వాటిని తమకు కేటాయించాలని లబ్ధిదారులు ఆందోళన బాట పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులకు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



ఇల్లందలో కండ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

వర్ధన్నపేట రూరల్, జూలై 22: రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఇల్లందలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా? అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఉన్న హక్కులను, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా, దివ్యాంగుల సమాజాన్ని అడుగడుగునా విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే భారత వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్మితా సభర్వాల్ వ్యాఖ్యలకు నిరసన కండ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, రాష్ట్ర మహిళా నాయకురాలు గుడపల్లి సుమతి, మండల అధ్యక్షుడు జట్టబోయిన శ్రీనివాస్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఇస్లావత్ బాలకృష్ణ, నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, నాయకులు షారుణ్, వెంకన్న, ముత్తయ్య, రమేష్, హరీఫ్ పాల్గొన్నారు.

వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఉద్యోగసంఘం నేతలు

కేయూ క్యాంపస్, జూలై 22: వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తమసమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013లో నియమితులైన బోధనేతర ఉద్యోగులందరికీ పే రివిజన్ జీతాలు ఇవ్వాలని, 2010లో నియమితులైన బోధన ఉద్యోగులను క్రమబద్ధీకరించా లని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఏఆర్, సూపరింటెండెంట్, ల్యాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్-2, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్, రికార్డు అసిస్టెంట్, బుక్ కీపర్ ఉద్యోగాలకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని అన్నారు. పీహెచ్‌డీ పూర్తిచేసిన ఉద్యోగులకు కోర్సు కోఆర్డినేటర్‌గా ప్రమోట్ చేయాలన్నారు. 2013 టెస్ట్ కోటా మేరకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలివ్వాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్డీఎల్ఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, బొక్క మొగిలి, దామెర ప్రభాకర్, నమిండ్ల కిరణ్‌కుమార్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మహేందర్

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేశాల మహేందర్ బాధ్యతలు చేపట్టారు. మహేందర్ ఇప్పటి ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందం స్థానంలో విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, సూపరింటెండెంట్ బొల్లెపాక ప్రభాకర్ నేతృత్వంలో ప్రిన్సిపాల్ మహేందర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సదాశివుడు, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, ఆనంద్, బి.శోభారాణి, మంద శ్యాం, పున్నం చందర్, పి.గౌతమి తదితరులు పాల్గొన్నారు.



మహేందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కళాశాల సిబ్బంది

ఆర్టీసీ అధికారులపై సస్పెన్షన్ వేటు

బాలసముద్రం, జూలై 22: వరంగల్ రిజీయన్ పరిధిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అకౌంట్ ఆఫీసర్ లావణ్యను ఆర్టీసీ ఉన్నాతాధికారులు సోమవారం సస్పెండ్ చేశారు. వరంగల్‌లో లావణ్య అద్దె బస్ ఓనర్ల నుంచి, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టర్లను వేధించడం, పెన్షనర్ల సెటిల్‌మెంటుకు డబ్బులు డిమాండ్ చేసిన ఆరోపణలపై విజిలెన్స్ డిపార్టుమెంట్ ఎంక్వైరీ చేశారు. ఈ నివేదిక అందుకున్న ఆర్టీసీ ఉన్నాతాధికారులు ఏవో లావణ్యను సస్పెండ్‌చేసినట్లు సోమవారం తెలిపారు. ఏవో లావణ్యకు సహకరించాడని అసిస్టెంట్ మేనేజర్‌గా ఫైనాన్స్ ఏవోగా ప్రమోషన్‌పై రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన రాంమోహన్‌ను సైతం సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

28 నుంచి కేయూ దూరవిద్య పీజీ కోర్సుల తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాది ఎంఏ పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సుల ప్రథమ ఏడాది ప్రథమ సెమిస్టర్, రెండో ఏడాది కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ దూర విద్య కేంద్రంలో జరిగే తరగతులను అభ్యర్థులందరూ హాజరు కావాలని కోరారు. మిగతా కోర్సుల కాంట్రాక్టు తరగతులను వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు.

రెడ్‌క్రాస్ కమిటీలో కొత్త వారికి అవకాశం

ఆరేళ్లు దాటితే తప్పుకోవాల్సిందే : గవర్నర్ ఆదేశాలు

వరంగల్ మెడికల్, జూలై 22: రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవనన్ నుంచి తాజాగా లేఖ నెంబర్ 681/టి2/ఎస్/2024 విడుదలైంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కీలక బాధ్యులుగా ఎన్నికై ఆరేళ్లకు పైగా కానీ, రెండు విడతలుగా కానీ కొనసాగుతున్న వారు ఇకపై స్వచ్ఛందంగా తప్పుకోవాల్సిందేనని లేఖలో పేర్కొంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్ర స్థాయిలో గవర్నర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జిల్లా కమిటీలో 10 నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. ఇందులో కీలక పదవుల్లో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఆరేళ్లు పూర్తి చేసుకున్న, రెండు విడతల పదవీ పూర్తిచేసుకున్న వారు వెంటనే స్వచ్ఛందంగా రాజీమానా చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రేసులో ముగ్గురు

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ విజయచందర్‌రెడ్డి చాలా ఏళ్లుగా పని చేస్తున్నారు. గవర్నర్ లేఖతో ఆయన స్వచ్ఛందంగా తప్పుకుంటే ఈ పదవికోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. డాక్టర్ శేషు మాధవ్, డాక్టర్ హరి సంధ్యారాణి, పెద్ది వెంకట నారాయణగౌడ్ పోటీ పడుతున్నారు.

నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన ధీశాలి దాశరథి

దాశరథి రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి : ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్



మహబూబాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 22: నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి పేదల పక్షాన నిలిచి కవిత్వాన్ని రాసిన మహాకవి దాశరథి ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో సోమవారం దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శత జయంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తక్కెళపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యవక్తగా హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. దాశరథి తన 20వ ఏటనే పోరాటాల బాట పట్టి నిరంకుశ పాలన సాగిస్తున్న నిజాం నవాబును ఎదిరించారని చెప్పారు. నిజామాబాద్ జైలులో బంధిస్తే అక్కడ బొగ్గు ముక్కతో ఓ నిజాం పిశాచమా అంటూ రాసి ఉద్యమాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి దాశరథి అని కొనియాడారు. జైలులో బంధించినప్పటికి సింహంలా గర్జించారని గుర్తుచేశారు. ఆయన ప్రజల కోసమే కవిత్వం రాసేవారని, తన రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. దాశరథి అంటేనే తెలంగాణ... తెలంగాణ అంటేనే దాశరథి అని తెలంగాణ అస్థిత్వాన్ని తన కవిత్వంలో చూపించారని పేర్కొన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజంలో దుర్మార్గం, వెట్టిచాకిరి విముక్తి తన కర్తవ్యంగా పనిచేశారని తెలిపారు. ప్రజా కవులు దాశరథి, కాళోజీల జీవిత చరిత్రలు చదివితే తెలంగాణ గూర్చి తెలుస్తుందని, సరళమైన పదాలతో అందరికి అర్థమయ్యే రీతితో దాశరథి కవిత్వం ఉండేదన్నారు. ఆంగ్ల కవి షేక్స్‌పియర్ కంటే గొప్ప కవి దాశరథి అన్నారు.

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు, జీవితాలు ప్రతిబింబాలుగా దాశరథి కవిత్వం ఉండేదని, ఆయన దేశం గర్వించదగ్గ కవి అని కొనియాడారు. ప్రజలను చెడు మార్గంలోకి వెళ్లకుండా సన్మార్గంలో నడిపించేది కవిత్వమని, దాశరథి గొప్ప మేధావి అని, ఆయన పుట్టిన గడ్డలో తాను ఎమ్మెల్యేగా పనిచేయడం అదృష్టమని చెప్పారు. దాశరథి సంపద పుస్తకాలేనని అలాంటి మహనీయుడిని ప్రజల్లోకి తీసుకువెళితే తెలుగును బతికించుకున్న వారమవుతామని తెలిపారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఊతమిచ్చిందని చెప్పారు.

ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. దాశరథి మన మధ్య లేకపోయినా జ్ఞాపకాలు మిగిలే ఉన్నాయని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాశరథి శత జయంతి ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. జాగీరు దారులకు వ్యతిరేకంగా గర్జిస్తూ ప్రజల కోసం.. పాలకులను ప్రశ్నిస్తూ తన కవితలను రాసిన మహా కవి దాశరథి అని తెలిపారు. టీఎన్జీవోస్ పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ.. దాశరథి పోరాట వారసత్వాన్ని ఈ సమాజానికి అందించాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ.. ప్రజల కోసం తన జీవితాన్ని ఫణంగా పెట్టి నిజాం నవాబును ధిక్కరించిన కవి దాశరథి అని చెప్పారు. చిన్నగూడూరుకు దాశరథి మండలంగా పేరు పెట్టాలని కోరారు. ఎమ్మెల్సీ, దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. దాశరథిని స్మరించుకుంటూ ఆయన జీవిత చరిత్రను భావితరాలకు అందిస్తూ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని చెప్పారు. జిల్లాలో సంవత్సర కాలం పాటు దాశరథి జయంతి ఉత్సవాలను జరిపి ముగింపు సభను జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సభకు హాజరైన వక్తలు, అతిథులను శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. చివరగా కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు అడ్డగోడ రాజేష్, ఉత్సవ కమిటీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కవి గుర్రపు సత్యనారాయణ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కన్న, జెరిపోతుల వెంకన్న, కవులు, దాశరథి అభిమానులు పాల్గొన్నారు.

గాయని సనశ్రీకి రికార్డుల పంట



సనశ్రీకి రికార్డుల పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జూలై 22: నగరానికి చెందిన ప్రముఖ గాయని సనశ్రీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఏకధాటిగా 8 గంటల పాటు 108 పాటలను ఆహుతుల సమక్షంలో ఆలపించి ప్రశంసలు అందుకుంది. అంతేగాక తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులలో సనశ్రీ పేరును నమోదు చేసుకోవడం విశేషం. ఈ అపూర్వ కార్యక్రమానికి హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియం వేదికగా నిలిచింది. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు పాల్గొని సనశ్రీని ప్రశంసలతో ముంచెత్తారు. కాకతీయ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు రంగు రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ అపూర్వ వేడుకలను ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య లాంఛనంగా ప్రారంభించగా నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి గాయని సనశ్రీని అభినందించారు. ఈ అవార్డులను జ్యూరీ మెంబర్ టీవీ అశోక్ కుమార్ హాజరై అందజేశారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీసీ దేవేందర్‌రెడ్డి

ఇద్దరు ఏటీఎం దొంగల అరెస్టు

కార్డులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం : ఏసీసీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 22: ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు దొంగలించే ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులకు సంబంధించిన వివరాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్‌కు చెందిన శుభం, ప్రియాంక అనే ప్రేమజంటకు బట్టలషాప్‌లో పనిచేసే శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్, సత్యవీర్, ప్రియాంక సింగ్, ఓ మైనర్ పరిచయమయ్యారు. కిందటేడు నుంచి ఆంధ్రప్రదేశ్, నాగపూర్, చంద్రపూర్ తీసుకెళ్లి దొంగతనం ఎలా చేయాలో శుభం, అతడి ప్రియురాలు నేర్పించారు. తర్వాత హనుమకొండ, వరంగల్‌లో కెనరా, ఎస్‌బీఐతో కలిపి 6 ఏటీఎంలలో విడతల వారీగా రూ.25,500 దొంగలించారు. తాజాగా సోమవారం హనుమకొండలోని కెనరా బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేసి డబ్బులు దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా పక్కాసమాచారంతో హనుమకొండ పోలీసులు అక్కడికి వెళ్లి శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్‌లతోపాటు ఒక మైనర్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి దొంగలించడానికి వినియోగించిన సామగ్రి, రెండు ఏటీఎంలు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రధాన నిందితులు శుభం, అతడి ప్రియురాలు ప్రియాంకతో పాటు సత్యవీర్, ప్రియాంక సింగ్ పరారీలో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ సీఐ వై.సతీష్, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్సై సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శిగా అజిత్‌రావు



అజిత్ రావు

వరంగల్ వ్యవసాయం, జూలై 22: ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-2 కార్యదర్శిగా దన్నపునేని అజిత్ రావు బదిలీ అయ్యారు. ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా భువనగిరి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న అజిత్‌రావును ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందగానే బాధ్యతలు చేపడుతానని అజిత్‌రావు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సూపర్‌వైజర్లు



మార్కెట్ కార్యదర్శి నిర్మలకు సూపర్‌వైజర్ల సత్కారం

మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా వర్ధన్నపేట మార్కెట్ నుంచి చక్రబహదూర్ రాయ్, నెక్కొండ మార్కెట్ కమిటీ నుంచి అల్లి జ్యోతిప్రకాష్‌ను, నర్సంపేట మార్కెట్ నుంచి ఎండి.సలీంను అలాగే మేకల రజిత జేఎంఎస్‌ను ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. కాగా, సోమవారం బదిలీపై వచ్చిన ముగ్గురు సూపర్‌వైజర్లను, ఒక జేఎంఎస్ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను మర్యాదపూర్వకంగా కలిసి బదిలీ ఉత్తర్వులను అందించారు. అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నిర్మలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రేడ్ కార్యదర్శి రామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీలు రాజ్‌కుమార్, గందమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు నల్ల నర్సింగరావు, గంగాధర్, భూక్యా వెంకన్న నాయక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

తెలంగాణ హెర్నియా సొసైటీ ఏర్పాటు

వరంగల్ మెడికల్, జూలై 22: కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐక్యాంప్‌లో హెర్నియా సర్జన్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఆవిర్భావం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఏర్పాటుకు కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కూరపాటి రమేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా నామినేట్ చేశారు. అనంతరం డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక లాపరోస్కోపీ సేవలు అందించడానికి డాక్టర్ కూరపాటి రమేశ్, ఇతర సభ్యులు బాధ్యత వహించి సేవలను విస్తత పర్చాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేశ్ చంద్రహరి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేయాలి


బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

వడ్డెపల్లి, జూలై 22: బీసీలు ఆశించే స్థాయి నుంచి.. శాసించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో దేశమంతా బీసీ ఉద్యమాన్ని విస్తరించి, ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60శాతంపైగా ఉన్న బీసీలు.. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం లేకపోవడంతో అరశాతం ఉన్న అగ్రవర్ణాలు అధికారాన్ని అనుభవిస్తున్నాయన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు7న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లోగల ద గోల్డెన్‌జూబ్లీ సెలబ్రేషన్ హాల్‌లో అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభలను నిర్వహిస్తున్నామని బీసీ సమాజమంతా పాల్గొని విజ యవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు బచ్చు ఆనందం, తాళ్ల సంపత్ కుమార్, కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, దాడి రమేష్, కురిమిళ్ల శ్రీనివాస్, తాళ్లపెల్లి రమేష్, కడారి అనిల్, పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాది శంకర్ ప్రసాద్‌రావుకు నివాళి



సంతాప కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 22: సీనియర్ న్యాయవాది కె.శంకర్‌ప్రసాద్‌రావు మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వరంగల్ అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 20న అనారోగ్యంతో మృతిచెందిన శంకర్ ప్రసాద్‌రావు హనుమకొండ పట్టణం అడ్వకేట్స్‌కాలనీకి చెందినవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 1995 నుంచి వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

అంతకుముందు హనుమకొండ జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా ప్రధానసెషన్స్ జడ్జి సీహెచ్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, ఇరు జిల్లాలకు చెందిన అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, ప్రభుత్వ న్యాయవాది కె.నర్సింహరావు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు లాడే రమేష్, ముదసర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్స జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా కళ్లల్లోనే ఆ పీడ కల

మోరంచపల్లిని ముంచేసిన వరదకు ఏడాది

- భారీగా వాటిల్లిన ప్రాణ, ఆస్తి, పంట నష్టం
- వరదల్లో ఐదుగురి గల్లంతు.. ముగ్గురి మృతదేహాలు లభ్యం
- ఇప్పటికీ దొరకని మరో ఇద్దరి ఆచూకీ
- ఆ కాళరాత్రినే తలుచుకుంటూ వణికిపోతున్న గ్రామస్థులు



గతేడాది వచ్చిన వరదతో మునిగిపోయిన మోరంచపల్లి గ్రామం (ఫైల్)

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 22: మోరంచపల్లి... భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉండే ఓ గ్రామం. ఆ ఊరికి వరద ఎలా ఉంటుందో ఎప్పుడు తెలియదు. కానీ, గతేడాది జూలై 27న అకస్మాత్తుగా భారీ వరద ఊరిని ముంచెత్తింది. క్షణాల్లో ప్రళయం అంటే ఎలా ఉంటుందో ఆ ఊరిజనాలకు ప్రత్యక్షంగా కళ్ల చూపింది. నాటి ఈ దుర్ఘటనలో మొత్తం ఐదుగురు గల్లంతవగా వారిలో ముగ్గురు మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వందలాది పశువులు, పెంపుడు జంతువులు మృత్యువాత పడ్డాయి. నాటి పీడకలకు ఏడాది పూర్తి కావస్తున్న వేళ మరోసారి వర్షాలు, వరదలు ప్రారంభం కావడంతో ఆ గ్రామస్థులు మళ్లీ ఉలిక్కి పడుతున్నారు.

ఆ రోజు తెల్లవారుజామున..

ఇంకో గంటయితే తెల్లవారుతుందనేలోపే గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. 2023 జూలై 26న మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా గణపసముద్రంలోకి నీరు అధికమై మత్తడి పెరగడంతో మోరంచవాగులోకి వరద పెరిగి ఇళ్లలోకి చేరింది. 27న తెల్లవారుజామున 4గంటల సమయంలో వరద గ్రామానికి తాకింది. అది గ్రహించిన కొంత మంది గ్రామస్థులు.. కుందయ్యపల్లి, కర్కపల్లి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వరద ముప్పును అంచనా వేయలేకపోయిన వారు ఇళ్లలోనే ఉండిపోవడంతో నీళ్లన్నీ ఇళ్లను ముంచెత్తాయి. ఇళ్ల సజ్జల వరకు నీరు వేగంగా ప్రవహించింది. దీంతో ప్రాణాలు కాపాడుకునేందుకు చాలా మంది ఇళ్ల సజ్జలు, స్లాబులు, చెట్లపైకి ఎక్కారు. ఇదంతా పూర్తిగా తెల్లవారాక సోషల్ మీడియా వేదికగా తమను కాపాడాలని బాధితులు ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంతో వారి ఆర్తనాదాలు బహిర్గతమయ్యాయి. అప్పటికప్పుడు అధికార యంత్రాంగం రంగంలోకి దిగి.. సింగరేణి రెస్క్యూ, అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది చేరుకొని వరదల్లో చిక్కుకున్న సుమారు 150 మందిని బోటు సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం సంచలనమైంది. అప్పటి ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో రెండు ఆర్మీ హెలికాప్టర్లు గంటల వ్యవధిలో మోరంచపల్లి గ్రామానికి చేరుకున్నాయి. గ్రామం మీదుగా చుట్టూ ముట్టి పైనుంచి సమీక్షించారు. గ్రామానికి అతి దగ్గరగా ఆ ప్రాంతాన్నంతా పరిశీలించారు.

నాలుగు కుటుంబాల్లో విషాదం

భారీగా వచ్చిన వరదలు నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. వరద తాకిడి తట్టుకోలేక ఐదుగురు గల్లంతు అయ్యారు. గ్రామానికి చెందిన గొర్రె ఓదిరెడ్డి, వజ్రమ్మ, గంగిడి సరోజన, గడ్డం మహాలక్ష్మితోపాటు గ్రామంలోని శ్మశానవాటికలో తలదాచుకున్న ఓ గుర్తుతెలియని యాచకుడు కొట్టుకపోయారు. వారి కోసం రెస్క్యూ బృందం గాలించినా ఆ రోజు మృతదేహాలు దొరకలేదు. మరుసటి మూడు రోజుల వ్యవధిలో గడ్డం మహాలక్ష్మి, గుర్తుతెలియని యాచకుడు మినహా మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే గడ్డం మహాలక్ష్మి.. భర్త శ్రీనివాస్ కళ్లారా చూస్తుండగానే కొట్టుకుపోవడం, ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడం, కనీసం మృతదేహం కూడా లభ్యం కాకపోవడంతో ఆమె తిరిగొస్తుందన్న ఆశలు వదులుకున్న భర్త తన భార్య ఇక బతికి రావడం కష్టమేనని భావించి నెలవారీ మాశికాలు నిర్వహించడంతో పాటు ఈనెల 15న ఆమె సంవత్సరీకాన్ని కూడా జరిపించారు.

అపారనష్టం..

మోరంచవాగు వరద ఉధృతి గ్రామస్థులను అన్ని రకాల నష్టాలను చవిచూపింది. మూగ జీవాల మృత్యుఘోష వినిపించింది. గ్రామంలో ఉన్న మూగజీవాలు ఊపిరాడక 153 గేదెలు, 753 కోళ్లు, 3 దుక్కిటెద్దులు, 5 బాతులు మృతి చెందాయి. మరో 50 గొర్రెలు వరదలో కొట్టుపోయాయి. ఇక పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 25,181 ఎకరాలు నీట మునిగాయి. వీటితో పాటు 1800 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి 13,290 ఎకరాలు, 11,891 ఎకరాల్లో పత్తి తీవ్రంగా నష్టాన్ని మిగిల్చింది. ఇక ఇళ్లలోని బియ్యం, దుస్తులు, మంచాలతో పాటు కూలర్, ఫ్రిజ్, టీవీ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు ఇళ్లలోని సామగ్రి మొత్తం తడిసిపోయాయి. అలాగే, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వరదలో కొట్టుకుపోయి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆగిపోయి కనిపించాయి.

కొండంత కష్టం.. గోరంత సాయం..

మోరంచపల్లి గ్రామస్థులకు వచ్చిన కష్టానికి సరిపడా సాయం అప్పటి సర్కారు అందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం మునక వైరల్ అయింది. కానీ, ఈ విషయంపై అప్పటి సీఎం గ్రామం పేరును కూడా కనీసం ప్రస్తావించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం తరుపున కేవలం రూ.10వేలు మాత్రమే అందించారు. అలాగే, సింగరేణి తరుపున కార్మికుల నుంచి కొంత మొత్తాన్ని జమ చేసి కుటుంబానికి రూ.15వేలు అందించారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సొంతంగా రూ.4వేల చొప్పున ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, తాగునీటిని అందించారు. ఇక వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి తోచిన సహాయాన్ని చేశారు. అయినా వీరికి జరిగిన లోటును మాత్రం పావలా వంతు కూడా పూడ్చలేకపోయింది.



సాయం కోసం వచ్చిన హెలికాప్టర్

పరామర్శలకే పరిమితం?

వరద ఉధృతి మోరంచపల్లిని ముంచేసిందనే వార్త ఆ సమయంలో సంచలనంగా మారింది. సోషల్ మీడియాతో పాటు టీవీచానళ్లు, దినపత్రికలు బాధితులకు అండగా ఉండి వారి బాధలను బహిర్గతం చేశాయి. దీంతో వివిధ పార్టీల నేతలు మోరంచపల్లి బాట పట్టారు. నాడు రాష్ట్ర మంత్రిగా ఉన్న సత్యవతి రాథోడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్, బీఎస్పీ నేతగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఇల్లిల్లు తిరిగి బాధితులను పరామర్శించారు. కానీ, వారి కష్టాలను గట్టెక్కించేందుకు మేమున్నామనే భరోసానివ్వలేకపోయారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

గండి పడిన చెరువులకు మరమ్మతులు

గతేడాది వరదలకు ప్రధానంగా వర్షపాతం అధికంగా నమోదు కావడం ఓ కారణమైతే.. ఇదే తరుణంలో గణపురం మండలం ధర్మరావుపేట చెరువు, వెంకటాపూర్ మండలం బూర్గుపేట చెరువులకు గండిపడటంతో ఈ వరద ముంచెత్తింది. మరోవైపు ఇదే సమయంలో గణపసముద్రంలోకి 22 అడుగులకు ఉండాల్సిన నీటి మట్టం ఒక్కసారిగా 33 అడుగులకు పెరిగి ఉప్పొంగడంతో ఈ సమస్య తీవ్రతరమైంది. అయితే, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలో భాగంగా చెరువుల మరమ్మతు పనులను సైతం చేపట్టింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేతృత్వంలో ధర్మరావుపేట ఊర చెరువుకు రూ.1కోటి 70లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. వెంకటాపురం మండలం బూర్గుపేట చెరువుకు సైతం గండి పడకుండా పకడ్బందీ మరమ్మతులు చేశారు. అయినప్పటికి గ్రామస్థులను మాత్రం ఆ భయం వీడకపోవడం శోచనీయం.



అధిక వరద తాకిడికి తెగిపోయిన జాతీయ రహదారి (ఫైల్)





రంగశాయిపేటలో ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ముంపు ప్రాంతాల్లో ఆహార ప్యాకెట్ల పంపిణీ

శంభునిపేట, జూలై 22: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలని తూర్పు ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం 42వ డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో ఆహార ప్యాకెట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలుగు సాంబేశం, నాయకులు కంచ మల్లయ్య, జినుక రమేష్, ప్రవీణ్, మైనారిటీ నాయకులు ఎస్డీ బషీర్, మునిసిపల్ జవాన్ ఎమ్డీ కలీం పాల్గొన్నారు.



బొల్లికుంటలో విద్యార్థులకు షూస్ అందించిన సమితి బాధ్యులు

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

శంభునిపేట, జూలై 22: విద్యార్థులను విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సద్గురు సేవా సమితి అధ్యక్షుడు పసునూరి వజ్రయ్య సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం షూస్, వాటర్ బాటిళ్లను అందించారు. వజ్రయ్య మాట్లాడుతూ.. చందుపట్ల మాధవి-దీన్‌దయాల్‌రెడ్డిల సహకారంతో 85మంది విద్యార్థులకు షూస్, వాటర్ బాటిళ్లను అందించామన్నారు. కార్యక్రమంలో అడ్డగట్ల లక్ష్మీనారాయణ, మార్గం ఎల్లయ్య, గుండు నాగభూషణం, మానుపాటి పరుశరాములు, గట్టికొప్పుల కేదారి, ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మచ్చిక రాజు గౌడ్, హెచ్ఎం పిండి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

దాశరథి శత జయంతి వేడుకలు

గీసుగొండ, జూలై 22: దాశరథి కృష్ణమాచారి శతజయంతి వేడుకలను సోమవారం ధర్మారం ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి అర్పించారు. కేయూ దూరవిద్య కో ఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు బాషాసంస్కృతి, సాహిత్యానికి దాశరథి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజమౌళి, ప్రణయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సౌమ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

గీసుగొండ, జూలై 22: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. కొనాయిమాకులలో ఇటీవల మృతిచెందిన విద్యార్థి కాందారి సౌమ్య, ఆరెపల్లిలో మృతిచెందిన సుధారాణి, శెట్టిపల్లి రాజేశ్వర్‌రావు, హరినాథ్ కుటుంబాలను చల్లా పరామర్శించారు. గీసుగొండకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోట ప్రమోద్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మాజీ సర్పంచ్‌లు పుండ్రు జయపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాష్, డోలి రాజేశ్వర్‌రావు, నాయకులు కొల్పుల కట్టయ్య, గోలి రాజయ్య, ముంత రాజయ్య, డోలి రమేష్, సంతోష్, జహీర్ పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈపై అవగాహన పెంచుకోవాలి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

మట్టెవాడ, జూలై 22: ఎంఎస్‌ఎంఈ(స్మాల్ మీడియం మైక్రో ఎంటర్ ప్రైజెస్)పై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ అధ్యక్షుడు భగవాన్ ముందడ అన్నారు. సోమవారం వరంగల్ హంటర్‌రోడ్‌లోని ఐసీఏఐ కార్యాలయం వద్ద ఐసీఏఐ హెడ్ ఆఫీస్ వారు ఎంఎస్‌ఎంఈ బస్సు యాత్రలో భాగంగా సోమవారం వరంగల్ జిల్లాకు బస్సు వచ్చింది. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సీఏ భగవాన్ దాస్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఎంఎస్‌ఎంఈపైన అవగాహన సదస్సును ఐసీఏఐ బ్రాంచ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారస్తులు ఎంఎస్‌ఎంఈ నందు రిజిస్ట్రేషన్ చేసుకొని లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సీఏ ఎం.సుజిత్, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ సీఏ రామకృష్ణ, సీఏలు, చాంబర్ ఆఫ్ కామర్స్ మెంబర్స్ పాల్గొన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

• పెరుగుతున్న నేరాలు • రంగశాయిపేటలో అసాంఘిక కార్యకలాపాలు • పట్టించుకోని అధికారులు

శంభునిపేట, జూలై 22: నిత్యం గస్తీ కాచే నిఘా నేత్రాలకు గ్రహణం పట్టింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుగా ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో గంజాయి, మందుబాబులు రెచ్చిపోతున్నారు. రంగశాయిపేటలో ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవటంతో అవి పనిచేయటం లేదు. దీంతో ఆ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. చోరీలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాలు జరిగినప్పుడు నిందితులను పట్టుకోవటానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రంగశాయిపేట జంక్షన్ గవిచర్ల క్రాస్ రోడ్‌లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. నగరానికి వచ్చే ప్రధాన జంక్షన్ కావటంతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం అవడంతో జంక్షన్‌లో నలువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే నగరం నుంచి ఖమ్మం రోడ్‌కు వెళ్లే వాహనాలను కెమెరా ద్వారా చూడటానికి జంక్షన్‌లోని సిగ్నల్‌పోల్ పక్కన గల డివైడర్ పోల్‌కి సీసీ కెమెరాలను అమర్చారు.

సీసీ కెమెరాలకు మరమ్మతు చేయాలి



సీసీ కెమెరాలు అమర్చిన నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. నేరాలు జరిగినప్పుడు ఉపయోగపడకుండా ఉన్నాయి. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అంటారు. వెంటనే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలి.

- బజ్జూరి నెలరాజు, రంగశాయిపేట

హరితహారంలో భాగంగా జంక్షన్‌లోని డివైడర్ భాగంలో నాటిన మొక్క పెరిగి కెమెరాకు అడ్డుగా ఉంది. చెట్ల కొమ్మలు తొలగించటంలో మునిసిపల్ సిబ్బంది విఫలం చెందారు. అలాగే గవిచర్ల రోడ్ వైపు, శంభునిపేట వైపు చూసే కెమెరాలు పనిచేయటం లేదు. ఈ జంక్షన్‌లో మద్యం దుకాణాలు ఉండటం నిత్యం రద్దీగా ఉండటంతో తరచూ ప్రమాదాలు, గొడవలు జరుగుతున్నాయి. జంక్షన్‌లో రోజు గంజాయి బ్యాచ్ ఎక్కువగా సంచరిస్తూ హల్‌చల్ సృష్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


రంగశాయిపేటలో రెండేళ్ల క్రితం స్థానిక కార్పొరేటర్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బొడ్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయటం లేదు. ఇదిలా ఉండగా ఏర్పాటు చేసిన నాలుగు కెమెరాల్లో ప్రస్తుతం ఒక్కటే ఉంది. అది కూడా కిందికి చూస్తూ ఉండటంతో ప్రయోజనం లేకుండాపోతోంది. రంగశాయిపేటకు ప్రధాన అంతర కూడలి అయిన బొడ్రాయి జంక్షన్ ద్వారానే ఎక్కువ రాకపోకలు జరుగుతుంటాయి. మహంకాళీ జంక్షన్ వద్ద సైతం సీసీ కెమెరాలు నిరుపయోగంగానే ఉన్నాయి. నిర్వహణ లోపం వల్లే సీసీ కెమెరాలు పనిచేయటంలేదనే విమర్శలు ఉన్నాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- రంగశాయిపేట జంక్షన్‌లో మద్యం దుకాణం ముందు ఓ గ్యాంగ్ నిత్యం హల్ చల్.
- ఇటీవలజంక్షన్‌లో ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదం చిన్నదైనా ఇరు వర్గాలు గొడవకు దిగాయి. ప్రమాదం గురించి తెలుసుకోవటానికి ప్రధాన ఆధారంగా ఉన్న సీసీ కెమెరా పనిచేయక పోవటంతో గొడవ జరిగినట్లు తెలిసింది.
- జంక్షన్‌లో ఇటీవల ఓ లారీని ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. లారీని ఒక్కసారిగా తిప్పటం వల్లే ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ నేరం మోపే ప్రయత్నం చేశాడు. చేసేదేమి లేక లారీ డ్రైవర్ ఆటో మరమ్మతులకు డబ్బులు చెల్లించాడు.
- గణేష్ నగర్, సాయినగర్ కాలనీల్లో వాహనాల చోరీలు జరిగినప్పుడు ఈ జంక్షన్ ద్వారా నిందితులు వాహనాలను తీసుకెళ్లినా సీసీ కెమెరాలు పనిచేయక గుర్తించలేకపోయారు.
- రంగశాయిపేట బొడ్రాయి జంక్షన్‌లో, మహంకాళీ ఆలయం వద్ద ఇటీవల కొందరు యువకులు రాత్రి సమయాల్లో అడ్డాలు వేసి హల్‌చల్ చేస్తున్నారు. అటుగా వచ్చిన వారిని వారిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వేరే ప్రాంతాల నుంచి గ్యాంగులు వచ్చి ఇక్కడి గ్యాంగులతో పోట్లాడిన సందర్భాలు ఉన్నాయి.



రంగశాయిపేట జంక్షన్‌లో సీసీ కెమెరాకు అడ్డుగా ఉన్న చెట్టు



రంగశాయిపేట బొడ్రాయి వద్ద కనిపించని కెమెరాలు

ఆశా వర్కర్లకు రూ. 18వేల వేతనం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

వరంగల్ కలెక్టరేట్, జూలై 22: ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు ఆశా వర్కర్లు నిరసన చేపట్టారు. రామస్వామి మాట్లాడుతూ ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో 33 ఏళ్ల నుంచి, మైదాన ప్రాంతంలో 13ఏళ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే సర్వేలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సీహెచ్.రాణి, వజ్ర, ఉషారాణి, సుజాత, మాధవీలత, రమ, పద్మ, మాధవి, రమాదేశి, మరియా, రజిత, అయూష, రాజేశ్వరి, కారుణ్య, స్వప్న, రమ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల, పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి, సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మచ్చ పవన్ కళ్యాణ్, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, రాజేందర్, ప్రమోద్, రఘు, శ్రీకాంత్, వేణు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

ధర్మసాగర్, జూలై 22: మధ్యాహ్న భోజనంలో పురుగు రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన సోమవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో జరిగింది. మండల కేంద్రం బాలికల పాఠశాలలో మహిళా సంఘాల ద్వారా రోజు వారీగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేశారు. అనంతరం భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న క్రమంలో ఓ విద్యార్థికి అన్నంలో పురుగు కనిపించింది. దీంతో విద్యార్థి భయాందోళనకు గురై తోటి విద్యార్థులకు తెలిపారు. దీంతో విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరి తినే అన్నాన్ని కింద పడేశారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు మురళిని వివరణ కోరగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ఒక విద్యార్థికి మాత్రమే అన్నంలో పురుగు వచ్చిందని, ఇక ముందు రాకుండా చూస్తామని ఆయన తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 22: నర్సంపేట జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణం పూర్తయినందున ఆగస్టు 1 నుంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాల, ఆస్పత్రి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన ఫినిషింగ్ పనుల్లో వేగం పెంచి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన మొత్తం ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్ త్వరితగతిన సమకూర్చుకొని, మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా ఆస్పత్రికి మంచినీటి సరఫరా కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రొఫెసర్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి సారథ్యంలో ఏడు కమిటీలను నియమించి ఆయా పనులు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నివేదించాలని తెలిపారు. నర్సంపేట చుట్టుపక్కల గ్రామాల్లో నూతన ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు ప్రారంభంపై ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది ద్వారా విస్తృతం ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపాల్ కిషన్, గోపాల్, టీజీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, మిషన్ భగీరథ ఈఈ వెంకట్రామిరెడ్డి, మెటర్నిటీ హాస్పిటల్ పీవో పద్మశ్రీ, రమేశ్, ఉషారాణి, విశ్వనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందించిన సమితి సభ్యులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఖిలావరంగల్, జూలై 22: విద్యార్థులు బాగా చదవి ఉన్నత రంగాలలో రాణించాలని శ్రీవాసవి విద్యా సేవాసమితి అధ్యక్షుడు శ్రీరాం భిక్షపతి అన్నారు. సోమవారం మధ్యకోటలోని ఆర్యా బాలుర ప్రభుత్వ సహాయక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవి అధ్యక్షతన విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. నరేందర్, సునీత, మనోజ్‌కుమార్, ఉషారాణి, సమితి కోశాధికారి ఎస్ సతీష్, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

సంగెం, జూలై 22 : మండలంలోని మొండ్రాయి గ్రామంలో ఇటీవల ఏడాకుల లింగమూర్తి ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా, సోమవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేష్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందించి చేయూతనిచ్చారు. ఆయనవెంట ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి యాకయ్య, పరికి రాజు, సారయ్య, మురళీ, దయాకర్, రాజేందర్, చంద్రమౌళి, రమేష్, చిన్నబాబు, రమేష్, హరికృష్ణ ఉన్నారు.

ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థినులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నర్సంపేట టౌన్, జూలై 22: నర్సంపేట పట్టణంలోని మైనారిటీ గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యానికి గురవడంతో సోమవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. మైనారిటీ గురుకులానికి చెందిన ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాస్మిన్, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆఫ్రీన్‌లకు అస్వస్థత గురవడంతో కళాశాల సిబ్బంది నర్సంపేట ఆస్పత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్య విషయంపై ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ శంకర్‌ను వివరాలు అడుగగా జాస్మిన్‌కు అపెండిక్స్ నొప్పి రావడంతో స్కానింగ్‌కు పంపించామని, ఆఫ్రిన్‌కు తలనొప్పి ఉండడంతో చికిత్సలందిస్తున్నామన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట

ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న హెడ్‌కానిస్టేబుల్.. గీసుగొండలో ఘటన

గీసుగొండ, జూలై 22: ప్లాట్ కొనుగోలు విషయంలో తనకు న్యాయం జరగడం లేదంటూ గీసుగొండ పోలీసు స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం. కొనాయిమాకుల వద్ద గల ఓ వెంచర్‌లో అదే గ్రామానికి చెందిన శిరీష రాజు 300 గజాల స్థలం కొనుగోలుకు చేశాడు. ఇందుకోసం నిర్వాహకులు శివకుమార్, రమేష్‌లకు అడ్వాన్స్‌గా రాజు రూ. 5లక్షలు ఇచ్చి ఏడాదిన్నర క్రితం అగ్రిమెంట్ చేసుకున్నాడు. అనంతరం రిజిస్ట్రేషన్ కోసం వెంచర్ నిర్వాహకులను ఎన్నిసార్లు అడిగినా చేయకపోవటంతో ఈనెల 11న గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో రాజు ఫిర్యాదు చేశాడు. సీఐ నిర్వాహకులను పిలిచి మాట్లాడగా కొంత సమయం తర్వాత చేస్తామని చెప్పారు. ఆ తర్వాత వారు రాకపోవటంతో రాజు తనకు న్యాయం జరగడం లేదంటూ సోమవారం పోలీస్‌స్టేషన్ ముందు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. గమనించిన ఏఎస్ఐ సుదర్శన్ బాధితుడు నుంచి డీజిల్ డబ్బాను తీసుకొని బయట పడేయటం ప్రమాదం తప్పింది. ఈ సమయంలో రాజు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'పద్మావతి' కాలేజీలో ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మల్లేశం

కాజీపేట, జూలై 22: కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ ల్యాబ్‌ను కళాశాల చైర్మన్ తాళ్లమల్లేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలోని 16 ఇంజనీరింగ్ కళాశాలలో తాళ్లపద్మావతిలో ల్యాబ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వంశీ చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భళా జంక్షన్..

చరిత్ర ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్న 'కుడా'



ఆరచేయి ఆకృతి వెనుక భాగం చిత్రం



నర్సంపేట రోడ్డు లో కుడా అభివృద్ధి చేస్తోన్న జంక్షన్‌లో ఆరచేయి ఆకృతి ముందు వైపు

గిర్మాజిపేట, జూలై 22 : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ వరంగల్ మహానగరంలోని ముఖ్య కూడలి ప్రాంతాలను వినూత్న జంక్షన్‌లుగా అభివృద్ధి చేస్తోంది. హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాలతో కూడిన వరంగల్ మహానగరంలోని ప్రధాన రహదారులలో 10 కూడలి ప్రాంతాలను రూ.4కోట్లతో జంక్షన్లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే హనుమకొండ, కాజీపేట పట్టణాల్లో జంక్షన్‌లను అభివృద్ధి చేసిన కుడా (కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) వరంగల్‌పై దృష్టి సారించింది. ఇందులో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్‌స్టేషన్, రైల్వేగూడ్స్ షెడ్, భారత్ పెట్రోలియం డిపో, రాంకీ విల్లాస్‌తో కూడిన ముఖ్యమైన కూడలి ప్రాంతాన్ని కుడా జంక్షన్‌గా రూపొందించింది. ఈ జంక్షన్‌లో ఆకాశం వైపు సాచిన ఆరచేయి ఆకృతిని ఏర్పాటు చేశారు. ఆరచేయి ఆకృతి కింది భాగంలో కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాణిరుద్రమదేవి చిత్రంతో పాటుగా కాకతీయ కళావైభావాన్ని కండ్లముందుంచేలా కాకతీయ కళాతోరణం, నంది విగ్రహం, చారిత్రాత్మక వెయ్యి స్తంభాల దేవాలయం చిత్రాలను ఏర్పాటు చేశారు. వీటి కింది భాగంలో జాతిపిత మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో సాగిన ఉప్పు సత్యాగ్రహం చిత్రాలను ఏర్పాటుచేస్తున్నారు. త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కుడా, వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. వరంగల్ రైల్వేస్టేషన్, నూతనంగా నిర్మించనున్న ఆర్టీసీ అధునాతన నూతన బస్ స్టేషన్ నిర్మాణం జరిగిన తర్వాత ఈ జంక్షన్ వరంగల్-నర్సంపేట మార్గానికి కీలకం కానుందని నగరవాసులు పేర్కొంటున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 22: స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా జాన్‌పీరీలు ఫీడర్ పరిధిలోని ధర్మారం, కోటగండి, సాయిబాబా ఆలయం ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని వరంగల్ డీఈ మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ కల్లు మండువా వద్ద రూ.71వేల విలువైన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కూరగాయల షాపు నిర్వహించే జి.సదానందం అనే వ్యక్తి వద్ద గుట్కా నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గుట్కా స్వాధీనం చేసుకుని సదానందంను విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధ్రువీకరించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 23 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

విద్యతోపాటు మార్షల్ ఆర్ట్స్ ముఖ్యం

నెక్కొండ, జూలై 22 : విద్యార్థులకు విద్యతో పాటు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ముఖ్యమని నెక్కొండ హై స్కూల్ ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ ఇక్బాల్ ఖాన్ అన్నారు. హై స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న కాయితోజు సోనాలిక, ఎనిమిదో తరగతి చదువుతున్న బల్ల ఐశ్వర్య విద్యార్థులు అండర్-13లో గోల్డ్ మెడల్ సాధించగా సోమవారం పాఠశాలలో అభినందించారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ 2024లో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జూలై 22: నర్సంపేట జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణం పూర్తయినందున ఆగస్టు 1నుంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాల, ఆస్పత్రి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన ఫినిషింగ్ పనుల్లో వేగం పెంచి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన మొత్తం ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్ త్వరితగతిన సమకూర్చుకొని, మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా ఆస్పత్రికి మంచినీటి సరఫరా కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రొఫెసర్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి సారథ్యంలో ఏడు కమిటీలను నియమించి ఆయాపనులు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నివేదించాలని తెలిపారు.నర్సంపేట చుట్టుపక్కల గ్రామాల్లో నూతన ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు ప్రారంభంపై ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది ద్వారా విస్తృతం ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపాల్ కిషన్, గోపాల్, టీజీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, మిషన్ భగీరథ ఈఈ వెంకట్రామిరెడ్డి, మెటర్నిటీ హాస్పిటల్ పీవో పద్మశ్రీ, రమేశ్, ఉషారాణి, విశ్వనారాయణ పాల్గొన్నారు.

ఆకేరు వాగు చెక్ డ్యాంపై మరమ్మతు పనులు చేపట్టండి

• ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

• 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



చెక్ డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్, జూలై 22 : ఆకేరు వాగు చెక్ డ్యాంపై తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామ శివారులోని చెక్ డ్యాం చివరన కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ నెల 18న ఆంధ్రజ్యోతిలో మరమ్మతుకు నోచుకోని చెక్‌డ్యాం అంటూ వచ్చిన కథనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వరమే తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టి పూర్తి నివేదికలు అందించాలని సూచించారు. గతంలోనే చెక్ డ్యాం పనులకు నిధులు మంజూరై ఉన్నాయని చెప్పడంతో పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం వరద వచ్చే అవకాశాలు ఉన్నందున జేసీబీతో మొరం పోయించి, ఇసుక బస్తాలు వేసి నీరు నిలిచేలా చూడాలన్నారు. తర్వాత శాశ్వత పనులు చేయాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ అఫ్సర్, అన్వర్‌లతో పాటు మండలపార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణలు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిందని, రైతులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు వివరించారు.

ఆస్పత్రిలో చేరిన గురుకుల విద్యార్థినులు

ఒకరికి అపెండిక్స్, మరొకరికి తలనొప్పి



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నర్సంపేట టౌన్, జూలై 22 : నర్సంపేట పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యానికి గురవడంతో సోమవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. మైనార్టీ గురుకులానికి చెందిన ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాస్మిన్, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆఫ్రీన్‌లకు అస్వస్థత గురవడంతో కళాశాల సిబ్బంది నర్సంపేట ఆస్పత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు. ఈ విషయంపై ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ శంకర్‌ను అడుగగా, జాస్మిన్‌కు అపెండిక్స్ నొప్పి రావడంతో స్కానింగ్‌కు పంపించామని, ఆఫ్రీన్‌కు తలనొప్పి ఉండడంతో చికిత్సలందిస్తున్నామన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

రాయపర్తి, జూలై 22 : వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందిన సంఘటన మండలంలోని పెర్కవేడులో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు నిమ్మల సోమయ్య కథనం ప్రకారం... తనకున్న ఇంటి ఆవరణలో గొర్రెలు, వాటి పిల్లలు కలిపి 10 గొర్లపై వీధి కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో తనకు సుమారు రూ. లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపాడు.

రాజకీయాలకతీతంగా నర్సంపేట పట్టణాభివృద్ధి

కాలనీలు, లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు సందర్శించాలి

తాగునీటి సమస్య తొలగించేందుకు రూ.12 కోట్లు మంజూరు

మునిసిపల్ ఆదాయం పెంపునకు భవనాలను నిర్మించాలి

మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జూలై 22 : నర్సంపేట పట్టణాన్ని రాజకీయాలకతీతంగా మునిసిపల్ చైర్‌పర్సన్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గుంటి రజని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైనందున పట్టణంలోని కాలనీలు, లోతట్టు ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు సందర్శించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టణంలోని అన్ని వార్డుల ప్రజ లకు 365రోజులు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో రూ.12 కోట్లు మంజూరీ చేయించానన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతీ వార్డుకు రూ. కోటి 50లక్షల చొప్పున రూ.40కోట్ల పనులకు టెండర్లు పూర్తయినట్లు తెలిపారు. సభ్యులకు ఇబ్బందులు ఉంటే కమినర్, చైర్‌పర్సన్ ద్వా రా తన దృష్టికి తీసుకురావాలన్నారు.. మునిసిపాలిటీలో నిధులు లేకున్నా అభివృద్ధి పనులకు నిధులందిస్తామన్నారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి తన వంతుకృషి చేస్తానని హామీ ఇచ్చారు. మునిసిపాలిటికి అదనపు షాపింగ్ కాంప్లెక్స్ భవనాలు నిర్మించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ మహిళాశక్తి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి మహిళా శక్తి అభివృద్ధికి కృషిచేయాలని కోరారు, కార్యక్రమంలో చైర్‌పర్సన్ గుంటి రజని, కమిషనర్ శ్రీనివాస్ కౌన్సిలర్లు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను పరిరక్షించాలి..

నాటిన మొక్కలను పరిరక్షించి, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట పలు ప్రధాన రోడ్ల వెంట, బాలుర హైస్కూల్ ఆవరణలో మునిసిపాల్ అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాదవరెడ్డి పాల్గొని మొక్కలను నాటారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో లక్ష 8 వేల మొక్కలను ప్రజలు భాగస్వాములై నాటాలని కోరారు. అనంతరం బాలుర హై స్కూల్ భవనాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు తాగునీటి కోసం అవసరమైన ప్యూరిఫైడ్ వాటర్ మిషన్, బోరు, విద్యుత్ మోటారును తక్షణమే మంజూరు చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. తరగతిలో కూడా విద్యుత్ వసతిని కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కొర్ర సారయ్య, ఎంవీ కృష్ణారావు. విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతాంగ సంక్షేమానికి కాంగ్రెస్ రుణమాఫీ

• టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



రైతులకు రుణమాఫీ చెక్కులను పంపిణీ చేస్తున్న నేతలు

వర్ధన్నపేట, జూలై 22 : రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేస్తోందని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. సోమవారం వర్ధన్నపేట మునిసిపాలిటీలోని డీసీసీబీ బ్యాంకులో రాయపర్తి, కొలన్‌పల్లి పీఏసీఎస్ సొసైటీల్లోని పలువురు రైతులకు రూ.లక్ష రుణమాఫీ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో కలిసి పంపిణీ చేశారు. మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రుణమాఫీ అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. రుణమాఫీ ద్వారా రైతులకు చేరినటువంటి డబ్బులను త్వరితగతిన రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిన్నచిన్న సమస్యల వల్ల ఆలస్యం జరుగుతుందని స్పష్టం చేశారు. రుణమాఫీ కానీ రైతులు నేరుగా వ్యవసాయ అధికారుల దగ్గరికి వెళితే సమస్యను వెంటనే పరిష్కరించి రుణమాఫీ అయ్యేవిధంగా అధికారులు చర్యలు చేపడతారన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సిబ్బంది రైతులకు సహకరించాలని కోరారు. ఈ రుణమాఫీ ప్రక్రియ పూర్తిస్థాయిలో రైతులకు చేరేలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్లు కొడగాని రాజేష్‌ఖన్నా, రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, పీఏసీఎస్ డైరెక్టర్ హనుమకొండ లక్ష్మీసుధాకర్, బ్యాంకు మేనేజర్ సమత, మునిసిపల్ కౌన్సిలర్ తోటకూరి రాజమణి, సమ్మెట సుధీర్, నాయకులు ఎండీ.అఫ్జర్, పెద్దబోయిన యాదమ్మ, రజిత, శివరాత్రి ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రత్యేక అధికారిని బదిలీ చేయాలి



పోస్టల్ అధికారికి లెటర్ అందజేస్తున్న సాంబయ్య

నల్లబెల్లి, జూలై 22: నల్లబెల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిని బదిలీచేయాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా కలెక్టర్ సత్యశారదకు వినతి పత్రాన్ని పంపారు.బట్టు సాంబయ్య మాట్లాడుతూ నల్లబెల్లి కేజీబీవీలో ప్రత్యేక అధికారి గత 8 నుంచి 10ఏళ్ల వ్యవధిగా ఇక్కడే తిష్టవేశారని తెలిపారు. విద్యాలయంలో అవినీతి జరిగే ఆస్కారం ఎక్కువ ఉందన్నారు. కాగా, ఈ సంవత్సరం 10మంది విద్యార్థులు పైగా ఫెయిలయ్యారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి వెంటనే అధికారి బదిలీ చేయాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



పర్వతగిరిలో రాస్తారోకో చేస్తున్న తార బంధువులు

పర్వతగిరి, జూలై 22 : మండలంలోని చింతనెక్కొండ గ్రామ శివారు బోటికాడి తండాలో ఆదివారం మృతిచెందిన భూక్యా తార కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు గిరిజనులు సోమవారం మండలకేంద్రంలో ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూక్యా తారను ఆమె భర్త తరఫు బంధువులు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీ కరిస్తున్నారని ఆరోపించారు. గతంలో తార భర్త చిరంజీవి సైతం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, అతని మరణంపై కూడా సందేహాలు వ్యక్తంచేశారు. మృతురాలి కుమారుడు భరత్‌కు సైతం ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. భరత్‌కు న్యాయంచేయాలని కోరుతూ ధర్నారాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకన్న సిబ్బందితో అక్కడకుచేరుకుని మృతురాలి బంధువులతో మాట్లాడారు. తార కుమారుడు భరత్‌కు న్యాయం చేస్తామ ని చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, తార అంత్యక్రియల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోటికాడితండాలో మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ రవికుమార్, గీసుగొండ సీఐ బాబులాల్, ఏనుమాముల సీఐ రమేష్, సంగెం ఎస్సై నరేష్, నెక్కొండ ఎస్సై మహేందర్, ఎనుమాముల ఎస్సై రాజు, మామునూరు ఎస్సై కృష్ణవేణి, స్పెషల్ పార్టీ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి




నర్సంపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట టౌన్, జూలై 22 : కామారెడ్డి ఎన్నికల సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నర్సంపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోతున్నా బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు బీసీ కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని, బీసీ రిజర్వేషన్లను 23 నుంచి 43 శాతానికి పెంచాలన్నారు. బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీపట్టణ ప్రధాన కార్యదర్శి కొంపెల్లి రాజు, బీజేవైఎం, బీజేపీ నాయకులు గూడూరు సందీప్, తౌటం నిశాంత్, కొంకీస విఘ్నేష్‌గౌడ్,సప్తగిరి, శీలం సత్యనారాయణ,బాల్నె జగన్ పాల్గొన్నారు.

• నల్లబెల్లి : బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ మండల అధయక్షులు బొందిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లబెల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్ఐ రాజేంద్ర ప్రసాద్‌కు బీజేపీ నాయకులు మెమోరాండం ఇచ్చారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు నెలలకే బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తడుక వినయ్, ఊటుకురు చిరంజీవి, పెరుమాండ్ల కోటి, సుధగాని ప్రమోద్, కడియాల విజయ్, మంద లోకేషన్, బోళ్ల నారాయణ, నవీన్ నాగరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్లతో నరకయాతన



బురద రోడ్డును చూపుతున్న కాలనీ వాసులు

ఖానాపురం, జూలై 22 : మండలంలోని అశోక్‌నగర్ ఇందిరా కాలనీలోని 9 వార్డులో బురదరోడ్లతో కాలనీ వాసులు నరక (నడక) యాతన పడుతున్నారు. ఏళ్ల తరబడి బురద రోడ్లతో సహవాసం చేస్తున్నారు. తమ గోడు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు పాక అనిల్, సతీష్, దుర్గాప్రసాద్, పెంటయ్య, ఆవుల సోమయ్య తదితరులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిసిందంటే రోడ్లపై ఉన్న వరదనీరు ఇండ్లలోకి ప్రవహించడంతో పాటు రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. కాలనీ వాసులు బయటకు రావాలంటే బురదరోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. బురద రోడ్లపై నడవాలంటే వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతూ బురదలో కూరుకుపోయిన సందర్భాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలువకుండా నీటిని మళ్లించి సమస్యల పరిష్కారం చూపాలని వేడుకున్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

నర్సంపేట టౌన్, జూలై 22 : బడ్జెట్‌లో విద్యా రంగానికి 30శాతం నిధులు కేటాయించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొగిలిచర్ల సందీప్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ నేటి (మంగళవారం) నుంచి జరగనున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో విద్యా రంగానికి నిధులు కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం అవలంబించిన ప్రజా, విద్యా వ్యతిరేక విధానాలను ప్రస్తుత ప్రభుత్వం అవలంబించడం శోచనీయమన్నారు. ప్రజాప్రభుత్వమని చెబుతూనే ఆచరణలో పారదర్శకత చూపకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. సమావేశంలో సమ్మెట వర్షన్, రవళి, రమ్య వెంకటేష్, రాము, సంధ్య, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు బోధన సామగ్రి పంపిణీ

దుగ్గొండి, జూలై 22 : మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్థానిక ఆధ్యాత్మిక గురువైన అంబరకొండ రాజమాత ఉచితంగా ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చందుపట్ల లక్ష్మీ, ఉపాధ్యాయురాలు అప్పాల నిర్మల పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

నెక్కొండ, జూలై 22 : ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలు చేస్తూ వారి మన్ననలను పొందాలని నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. తసిల్దార్ కార్యాలయంలో విధులను నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ల రఘు నర్సంపేట ఆర్డీవో కార్యాలయంకు , టైపిస్టు సుధాకర్ వరంగల్ తహసీల్దార్ కార్యాలయంకు బదిలీపై వెళ్లగా సోమవారం కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గొరంటల వెంకటనారాయణ, డీలర్లు సంతోష్, రమేశ్, జనగాం వెంకట్‌నారాయణ, వాగ్యానాయక్, రాజేష్, రవి, మహేందర్ పాల్గొన్నారు.

కూలిన పూరిళ్ల గోడలు

చెన్నారావుపేట, జూలై 22: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండల కేంద్రంలోని ఈర్యతండాలో పూరిళ్ల గోడలు కూలిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. బాధితుడి కథనం ప్రకారం... ఇదే తండాకు చెందిన ధరంసోతు యాకయ్య, గుగులోతు లాలు పూరిళ్ల గోడలు నానాయి. దీంతో ఒక్కసారిగా గోడలు కూలిపోయాయి. పూర్తిగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. మండల కేంద్రానికి చెందిన కోరే రాకేష్ వ్యవసాయ బావి ఒడలు సైతం వర్షంతో కుంగిపోవటంతో, తీవ్ర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సురేందర్



ఖానాపురం, జూలై 22: మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సంక్షేమగురుకుల సైనిక పాఠశాల ప్రిన్సిపాల్‌గా గట్ల సురేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సురేందర్ గ్రేడ్-2 ప్రిన్సిపాల్‌గా ఐఐటీస్టడీ సెంటర్ రాజేంద్రనగర్‌లో పనిచేస్తూ గ్రేడ్-1 ప్రిన్సిపాల్‌గా సైనిక పాఠశాలకు పదోన్నతిపైవచ్చారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉత్తమఫలితాలు సాధించాలని సూచించారు.

ఖానాపురం ఎంపీవోగా సునీల్



ఖానాపురం, జూలై 22 : ఖానాపురం ఎంపీవోగా అంబటి సునీల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీవో రవి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నర్సంపేట నుంచి బదిలీపై సునీల్ ఎంపీవోగా ఖానాపురం వచ్చారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్తువుల దగ్ధం

వర్ధన్నపేట రూరల్, జూలై 22 : షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని వస్తువులు దగ్ధమైన సంఘటన మండలంలోని దమ్మన్నపేటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... దమ్మన్నపేటకు చెందిన ఎలికట్టె నర్సయ్య అనే రైతు తన భార్యతో కలిసి ఇంటికి తాళంవేసి బ్యాంకు పని నిమిత్తం వర్ధన్నపేటకు వెళ్లారు. స్థానికులు ఇంట్లో మంటలను గమనించి వారికి సమాచారం అందించడంతో వచ్చి చూసే సరికి మంటలు రావడం గమనించి వాటిని స్థానికుల సహాయంతో ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న పత్తి బస్తాలు, బియ్యం బస్తాలతో పాటు నిత్యావసర వస్తువులు, రూ.5వేల నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, జూలై 22 : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వో జ్యోతి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఏనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి దాశరథి కృష్ణమాచార్య అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తేజస్విని, షాహీనా, రజిత, రజని, పల్లవి, ఉమ, సుజాత, దేవిక, స్వప్న పాల్గొన్నారు.

'అపరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు'



అప్పల్‌రావుపేటలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

నెక్కొండ, జూలై 22 : వర్షకాలంలో గ్రామీణ ప్రాంతాల్లోని వీధుల్లో నీటి నిలువల కారణంగా దోమలు స్వైరవిహారం చేయడంతో సీజనల్ వ్యాధులు ప్రభలుతాయని, వ్యాధులను అరికట్టుటకు పరిసరాలను పరిశుభ్రంగాఉంచుకోవాలని నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రహెలాతన్వీర్ అన్నారు. సోమవారం మండలంలోని నెక్కొండ, అప్పల్‌రావుపేట, పత్తిపాక, దీక్షకుంట, చంద్రగొండ గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. వ్యాధులు ప్రభలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. జ్వరంతో బాధపడుతున్న వారు వెంటనే వైద్య చికిత్స కోసం ఆరోగ్యకేంద్రానికి రావాలని డాక్టర్ సూచించారు. ఈ కాలంలో కాచిచల్లార్చిన నీటిని తాగడంతో పాటు సాధ్యమైనంత వరకు వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యాధికి గురైన వారితో పాటు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు కూడా అధికంగా పండ్లను తీసుకోవడంవల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని వివరించారు. వ్యాధులతో బాధపడుతున్న రోగుల నుంచి పరీక్షలు జరిపేందుకు రక్తం, మూత్రం నమూనాలను సేకరించారు. దగ్గు, జలుబు వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులకు మందులను ఇచ్చారు. ఈ శిబిరాల్లో డాక్టర్ సుమన్, డాక్టర్ రాహుల్, డాక్టర్ రమ్య, డాక్టర్ మౌనిక, పీఎస్‌హెచ్ అరుణ, సూపర్‌వైజర్ యాకస్వామి, వైద్య సిబ్బంది వరమ్మ, రవీచంద్రారెడ్డి, సంజీవ్‌కుమార్, సరిత, యాకలక్ష్మి, రజిత, సరోజన, నాగలక్ష్మి, స్వప్న, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

• అడ్డుకున్న హెడ్‌కానిస్టేబుల్.. గీసుగొండలో ఘటన

గీసుగొండ, జూలై 22 : ప్లాట్ కొనుగోలు విషయంలో తనకు న్యాయం జరగడం లేదంటూ గీసుగొండ పోలీసు స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం. కొనాయిమాకుల వద్ద గల ఓ వెంచర్‌లో అదే గ్రామానికి చెందిన శిరీష రాజు 300 గజాల స్థలం కొనుగోలుకు చేశాడు. ఇందుకోసం నిర్వాహకులు శివకుమార్, రమేష్‌లకు అడ్వాన్స్‌గా రాజు రూ. 5లక్షలు ఇచ్చి ఏడాదిన్నర క్రితం అగ్రిమెంట్ చేసుకున్నాడు. అనంతరం రిజిస్ట్రేషన్ కోసం వెంచర్ నిర్వాహకులను ఎన్నిసార్లు అడిగినా చేయకపోవటంతో ఈనెల 11న గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో రాజు ఫిర్యాదు చేశాడు. సీఐ నిర్వాహకులను పిలిచి మాట్లాడగా కొంత సమయం తర్వాత చేస్తామని చెప్పారు. ఆ తర్వాత వారు రాకపోవటంతో రాజు తనకు న్యాయం జరగడం లేదంటూ సోమవారం పోలీస్‌స్టేషన్ ముందు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. గమనించిన ఏఎస్ఐ సుదర్శన్ బాధితుడు నుంచి డీజిల్ డబ్బాను తీసుకొని బయట పడేయటం ప్రమాదం తప్పింది. ఈ సమయంలో రాజు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.